క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థినుల ఎంపిక


జంగా లీనా రోజ్


బొక్కా యజ్ఞశ్రీ సత్య

అమలాపురం టౌన్: అమలాపురం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థినులు జంగా లీనా రోజ్, బొక్కా యజ్ఞశ్రీ సత్యలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.గౌరీశంకర్ తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో లీనా రోజ్ 600 మార్కులకు గాను 565 మార్కులు, యజ్ఞశ్రీ సత్య 600 మార్కులకు గాను 560 మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా వారిద్దరినీ అభినందించారు.

ట్రిపుల్ ఐటీ విజేత రతన్‌కు అభినందనలు

అమలాపురం టౌన్: ట్రిపుల్ ఐటీకి ఎంపికైన కొంకాపల్లి జవహర్ లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థి నెల్లి హితేష్ రతన్‌ను స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, రాష్ట్ర దృశ్య కళల అకాడమి చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ, మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడులు శనివారం అభినందించారు. విద్యార్థి రతన్ భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అలాగే ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణ, ఉపాధ్యాయుడు బీఎస్ వెంకటేశ్వరావులను కూడా చైర్‌పర్సన్ నాగేంద్రమణి, కమిషనర్ నాయుడు అభినందించారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి రమేష్‌ను కలిసిన ఆర్డీవో, డీఎస్పీ


జిల్లా ఇన్‌చార్జి మంత్రి రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్డీవో వసంతరాయుడు, డీఎస్పీ అంబికా ప్రసాద్

అమలాపురం టౌన్: జిల్లా పర్యటనకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను అమలాపురం సర్ ఆర్థర్ కాటన్ అతిథి గృహంలో ఆర్డీవో వసంతరాయుడు, డీఎస్పీ అంబికా ప్రసాద్‌లు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి రమేష్‌కు పూలకుండీ అందించి ఆర్డీవో, డీఎస్పీలు కొద్దిసేపు మాట్లాడారు.

జగనన్న సురక్ష సర్వే పరిశీలన

అల్లవరం: బోడసకుర్రు సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష సర్వేని సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి శనివారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ప్రారంభమైన సర్వే ఈ నెల 21 నాటికి పూర్తి చేయాలని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు సర్పంచ్ తెలిపారు. జగనన్న సురక్షలో సర్వేలో నమోదు చేసుకున్న లబ్ధిదారులకు జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో దొమ్మేటి శివస్వామి, వెల్ఫేర్ అసిస్టెంట్, వలంటీర్లు పాల్గొన్నారు.

కోపరేటివ్ సిబ్బంది దీక్ష విరమణ

యానాం: బకాయి వేతనాలు చెల్లించాలంటూ గత ఐదు రోజులుగా రిలే దీక్షలు చేస్తున్న యానాం కోపరేటివ్ సిబ్బంది శనివారం సాయంత్రం నిరసన విరమించారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి ఉద్యోగ సంఘాల కాన్ఫెడరేషన్ యానాం శాఖ అధ్యక్షుడు చెల్లి గోపీనాథ్, బీసీ సేన ప్రధానకార్యదర్శి మల్లాడి సత్తిబాబులు నిరసనకారులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. అనంతరం ఆర్ఏఓ మునిస్వామిని కలిసి సమస్య విన్నవించుకోవడంతో ఆయన స్పందించి ఐదు రోజుల్లో పుదుచ్చేరి ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

మట్టి అక్రమ రవాణాను అడ్డుకున్న వీఆర్వో

తాళ్లరేవు: మండల పరిధిలోని చొల్లంగిపేట గ్రామ పంచాయతీలో స్థానిక ఎస్సీ ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీకి చెందిన భూముల్లో కొందరు మట్టిని అక్రమంగా తరలిస్తుండగా స్థానిక నాయకులు, గ్రామస్తులు అడ్డుకుని రెవెన్యూ అధికారులకు సమాచారమిచ్చారు. స్థానిక వీఆర్వో కాశే రత్నం ఆ ప్రాంతానికి చేరుకుని అనుమతుల్లేకుండా ఎలా మట్టిని తరలిస్తున్నారంటూ ప్రశ్నించి పనులు నిలిపేశారు. మట్టి అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయం వద్దకు తీసుకురావాలని ఆదేశించినా వారు ఖాతరు చేయకపోవడం గమనార్హం.

సమాజసేవ జీవిత లక్ష్యం కావాలి

ముమ్మిడివరం: ప్రతిఒక్కరికీ సమాజ సేవ జీవిత లక్ష్యం కావాలని, అప్పుడే మానవ జీవితం ధన్యమవుతుందని అమలాపురం వైఎస్సార్ సీపీ నాయకుడు, జిల్లా వికలాంగుల సంఘ గౌరవ అధ్యక్షుడు వంటిద్దు వెంకయ్యనాయుడు అన్నారు. ముమ్మిడివరం మండలం ఠానేలంకలో శారదా అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో శనివారం అమలాపురం సాయి సంజీవని వాకర్స్ యోగా ఆరోగ్య సంస్థ మహిళా డైరెక్టర్ జల్లి సుజాత వితరణతో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, ప్లాస్టిక్ బాక్సులు పంపిణీ చేశారు. కనుమరుగవుతున్న తెలుగువారి సాంప్రదాయ క్రీడలైన బొంగరాలాట, గోళీలాట, చెడుగుడు, కబడ్డీ వంటి క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

సాగుకు సంపూర్ణ భరోసా

- రైతు నేస్తాలుగా రైతు భరోసా కేంద్రాలు
- రైతు ముంగిటకే ఎరువులు, విత్తనాలు

అల్లవరం: గత ప్రభుత్వంలో రైతులు విత్తనాలు, ఎరువుల కోసం యుద్ధం చేయాల్సి వచ్చేది. పంట రుణమైతే అందని ద్రాక్షగా ఉండేది. తాళిబొట్టు తాకట్టు పెట్టో, వడ్డీ వ్యాపారుల దగ్గర అప్పులు తీసుకునో వ్యయప్రయాసల కోర్చి పంట పండిస్తే దళారుల మోసంతో గిట్టుబాటు ధర దక్కేది కాదు. ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనప్పుడు బీమా వర్తిస్తుందేమోనని ఆశగా ఎదురుచూసిన రైతులకు నిరాశే ఎదురయ్యేది. ప్రజా సంకల్పయాత్రలో రైతుల కష్టాలను చూసి చలించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల కష్టాలకు ఒక్కొక్కటిగా పరిష్కారం చూపారు. రైతు ముంగిట్లోకే అన్ని సౌకర్యాలను కల్పించేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేశారు. రైతులకు కావాల్సిన సాంకేతిక సలహాలు, సంక్షేమ పథకాలు, సేవలను ఆర్బీకేల ద్వారా అందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచారు.

నిరంతరం రైతు సేవలోనే..

విత్తనం నుంచి పంట అమ్ముకునే వరకూ అడుగడుగునా రైతుకు అండగా ఉంటూ సాగుకు సంపూర్ణ భరోసా కల్పించేలా రైతు భరోసా కేంద్రాల్ని రూపొందించారు. రైతు భరోసా కేంద్రాల రాక తరువాత గ్రామాల్లో వ్యవసాయం విప్లవం మొదలైంది. గతంలో రైతులకు ఏ అవసరం వచ్చినా మండల కేంద్రాల్లో ఉండే వ్యవసాయశాఖ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులు వారి సొంత గ్రామాల్లోనే అన్ని రకాల సేవలు పొందుతున్నారు. పొలంబడి ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు సాంకేతిక సలహాలు, సూచనలు ఇస్తున్నారు. మట్టి నమూనా పరీక్షల ద్వారా పోషక లోపాలను గుర్తించి ఎరువుల సమతుల్యతను పాటించి అధిక దిగుబడులు సాధించేలా రైతులను ప్రోత్సహిస్తున్నారు. కియోస్క్ యంత్రం ద్వారా రైతులకు నాణ్యమైన, మార్కెట్ రేటు కంటే తక్కువ ధరకు ఎరువులు, విత్తనాలు సరఫరా చేస్తున్నారు. ఈ–పంట నమోదు చేసి తద్వారా సంక్షేమ పథకాలకు అనుసంధానం చేస్తున్నారు.


వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో రైతులకు ట్రాక్టర్ అందిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు

అల్లవరం మండలంలో...

అల్లవరం మండలంలోని 23 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సంక్షేమ పథకాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్నారు. 253 మట్టి నమూనా పరీక్షలు నిర్వహించి, ఫలితాల సర్టిఫికెట్‌లను అందించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 289 మంది రైతులకు రూ.6.03 లక్షల విలువైన 97 క్వింటాళ్ల విత్తనాలను సబ్సిడీపై అందించారు. రైతు భరోసా, పీఎం కిసాన్ పథకంలో ఐదో విడతగా 5,752 మంది రైతులకు రూ.3,16,36,000 పంపిణీ చేశారు. ఉచిత పంట బీమా పథకంలో 49 మంది రైతులకు రూ.8,64,000 బీమా పరిహారాన్ని అందించారు. కోడూరుపాడు గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా 38 మంది కౌలు రైతులకు సహకార బ్యాంకు నుంచి రూ.5,20,000 పంట రుణాలను అందించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 3,637.920 మెట్రిక్ టన్నుల ధ్యాన్యాన్ని సేకరించి, రూ.5.56 కోట్లు సొమ్మును రైతుల ఖాతాలకు జమ చేశారు. ఇవే కాకుండా సకాలంలో పంట రుణాలు చెల్లించిన రైతులకు సున్నా వడ్డీ రాయితీ, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు దెబ్బతింటే ఇన్‌పుట్ సబ్సిడీ పథకాల ద్వారా రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది.

ఐదుసార్లు రైతు భరోసా లబ్ధి



ప్రభుత్వం అమలుచేస్తున్న రైతు భరోసా పథకం ద్వారా ఐదు సార్లు లబ్ధి పొందాను. రైతు భరోసా డబ్బులు వ్యవసాయ పెట్టుబడికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఆర్బీకేల్లో విత్తనాలు, ఎరువులు అందించడమే కాకుండా పంటకు గిట్టుబాటు ధర లభిస్తుంది. సాగుకు అవసరమైన సలహాలు సైతం ఇస్తున్నారు.
– సాపే సత్యవతి, ఎంట్రుకోన, అల్లవరం మండలం

పవర్ టిల్లర్ ఇచ్చారు



నేను రెండెకరాల్లో సాగు చేస్తున్నాను. ఇప్పటికే ఐదు సార్లు రైతు భరోసా పొందాను. వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో రాజన్న సీహెచ్‌సీ గ్రూపులోని 10 మంది రైతులకు కలిపి 40 శాతం సబ్సిడీపై పవర్ టిల్లర్ ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.
– కొక్కిరిమెట్టి మహాలక్ష్మి, కోడూరుపాడు, అల్లవరం మండలం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

అల్లవరం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ అన్నారు. మండలంలోని గోడిలంక, దేవగుప్తం గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వలంటీర్ వ్యవస్థ ఏర్పాటుచేసి లబ్ధిదారుల ఇంటికే సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికేట్‌లను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్‌లు రుద్రరాజు లక్ష్మీపతి రాజు, సాధనాల వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాతి శ్రీను, ఎంపీటీసీ ఎం.రాంబాబు, గ్రామకమిటీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


దేవగుప్తంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అర్హులందరికీ జగనన్న సురక్ష

తాళ్లరేవు: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణలు అన్నారు. శనివారం పోలేకుర్రు పంచాయతీలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వారిద్దరూ మాట్లాడారు. అనంతరం 550 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, ప్రత్యేకాధికారి లక్ష్మీ నరసయ్య, ఈఓపీఆర్‌డీ మల్లాడి భైరవమూర్తి, పంచాయతీ కార్యదర్శి బి.జ్యోతిసుధ, ఎంపీటీసీ సభ్యురాలు బళ్ల సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉండిపోయిన సమస్యల పరిష్కారానికే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారని ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి అన్నారు. మండలంలోని కూనవరం, గోపవరం గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాలకు ఎంపీపీ జానకీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమాల్లో గోపవరం, సరిపల్లి గ్రామాలకు సంబంధించి 1,576 ధ్రువపత్రాలు, కూనవరం, కిత్తనచెరువు గ్రామాలకు సంబంధించి 1,306 ధ్రువపత్రాలు అందించామని ఎంపీడీవో కె.ఎస్.గౌరీకుమారి, తహసీల్దార్ జె.వెంకటేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కుంచే బుల్లియ్య, వాకపల్లి ఈశ్వరి, ఎంపీటీసీ సభ్యులు కొంకి ఏడుకొండలు, కాట్రు ధనలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు ఊటాల రామాంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: అర్హులు తమకు అవసరమైన ధ్రువపత్రాలు సులువుగా పొందటానికి జగనన్న సురక్ష ద్వారా మంచి అవకాశం లభించిందని ముమ్మిడివరం నగర పంచాయతీ చైర్‌పర్సన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలో బొండాయికోడు సచివాలయం వద్ద శనివారం నగర పంచాయతీ కమిషనర్ జి.లోవరాజు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వేటుకూరి బోసురాజు, కె.జయలక్ష్మి, కుడిపూడి హరికృష్ణ, రెడ్డి శివన్నారాయణ పాల్గొన్నారు.


పోలేకుర్రులో మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎంపీపీ సునీత తదితరులు


కూనవరంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ఎంపీపీ జానకి

భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్

యానాం: భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు 2022–23 విద్యా సంవత్సరానికి గాను పుదుచ్చేరి బిల్డింగ్, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులను అందజేయనున్నట్లు ఆ శాఖ కార్యదర్శి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ప్రథమ స్థానానికి రూ.60 వేలు, ద్వితీయస్థానానికి రూ.40 వేలు, తృతీయ స్థానానికి రూ.20 వేలు అందజేయనున్నామన్నారు.

చిరకాల సమస్యకు పరిష్కారం

అమలాపురం రూరల్: మండలంలోని కామనగరువు పరిధి చిట్టమ్మ చెరువు నుంచి ఎంఎస్ఎన్ కాలనీ వరకూ అధ్వానంగా ఉన్న రోడ్డు సమస్యకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ చొరవతో పరిష్కారం లభించింది. ఈ రోడ్డు నిర్మించాలంటూ స్థానికులు ఎన్నో ఏళ్ల నుంచి పోరాటం చేస్తున్నారు. సర్పంచ్ అరుణకుమారి దంపతులు సమస్యను మంత్రి విశ్వరూప్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సహకారంతో రోడ్డు నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. బీటీ రోడ్డు నిర్మాణం పూర్తవడంతో ఎంతో ఆనందంగా ఉందని సర్పంచ్ అరుణ కుమారి, చంద్రశేఖర్ దంపతులు సంతోషం వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణానికి సహకరించిన మంత్రి విశ్వరూప్‌కు గ్రామం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

డీటీగా శివసుబ్రహ్మణియన్ నియామకం

యానాం: యానాం రెవెన్యూ శాఖ డిప్యూటీ తహసీల్దార్‌గా ఎ.శివసుబ్రహ్మణియన్‌ను నియమిస్తూ పుదుచ్చేరి డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డిప్యూటీ కలెక్టర్ ఎం.ఎం.వినయ్‌రాజ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకూ డీటీ పనిచేసిన గణేషన్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం, అనంతరం ఆయన స్థానంలో పి.మునిమారన్‌ను నియమించినా ఆయన విధుల్లో చేరకపోవడంతో శివసుబ్రహ్మణియన్‌ను నియమించారు. దీంతో కొన్ని నెలలుగా డీటీ లేక తీవ్ర ఆటంకం ఏర్పడిన రెవెన్యూ సంబంధిత పనులకు అడ్డుకట్ట తొలగినట్టైంది.

పాత, కొత్త పార్లమెంట్ భవనాల నాణెం సేకరణ

అమలాపురం టౌన్: భవిష్యత్ అవసరాల కోసం నిర్మించిన పార్లమెంట్ నూతన భవనం, పూర్వపు పార్లమెంట్ భవనంతో కూడిన రూ.75 స్మారక నాణేన్ని కోల్‌కత్తా టంకశాల ముద్రించి విడుదల చేసింది. ఈ నాణేన్ని అమలాపురం పట్టణం భూపయ్య అగ్రహారానికి చెందిన నాణేల సేకరణ కర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ ప్రత్యేక ఆర్డర్‌పై సేకరించారు. ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విడుదల చేసిన ఈ నాణెం 50 శాతం వెండి, 40 శాతం రాగి, చెరో 5 శాతం నికెల్, జింక్ కలిగి ఉంటుందని సేకరణ కర్త కృష్ణ కామేశ్వర్ తెలిపారు.



పాత, కొత్త పార్లమెంట్ భవనాల చిత్రాలతో ముద్రితమైన నాణెం



రూ.75 ముఖ విలువతో ఉన్న నాణెం

నిందితుడికి 14 రోజుల రిమాండ్

అల్లవరం: చోరీ కేసులో నిందితుడికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించిందని డీఎస్పీ అంబికాప్రసాద్ శనివారం తెలిపారు. అల్లవరం మండలం తుమ్మలపల్లిలో మార్చి 21న కె.రవికుమార్‌కు చెందిన తాటాకిల్లు తలుపులు పగులగొట్టి బంగారు వస్తువులు, నగదు, మొబైల్ చోరీకి పాల్పడిన రేకాడి లక్ష్మణరావుని అరెస్టు చేశామన్నారు. అతడి నుంచి 4 గ్రాముల బంగారు గొలుసు, మొబైల్ ఫోన్ రికవరీ చేశామన్నారు. నిందితుడిని శనివారం అమలాపురం కోర్టులో హాజరుపరచగా 14 రోజుల పాటు రిమాండ్ విధించడంతో రాజమహేంద్రవరం జైలుకి తరలించామన్నారు.

యానాం విద్యార్థులకు స్టేట్ బెస్ట్ చైల్డ్ అవార్డులు

యానాం: పుదుచ్చేరి విద్యాశాఖ పరిధిలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన యానాంకు చెందిన ముగ్గురు చిన్నారులకు పుదుచ్చేరి బెస్ట్ చైల్డ్ అవార్డులను పుదుచ్చేరి సీఎం రంగసామి చేతుల మీదుగా శనివారం అందజేశారు. పుదుచ్చేరిలో జరిగిన కార్యక్రమంలో ఎంపికైన చిన్నారులు మాగాపు దీపిక(ఆర్‌జేసీ), తోటకూర లక్ష్మీమాధవి(ఆర్‌జేసీ), కసిరెడ్డి శేషిత(శారద ఎయిడెడ్‌స్కూల్)లకు 2020, 2021, 2022 సంవత్సరాలకు గాను అవార్డులను అందజేశారు. అవార్డు గ్రహీతలకు ఒక్కొక్కరికి రూ.5 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అనంతరం సీఎం రంగసామి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే భవిష్యత్‌కు మంచి పునాది వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్పీకర్ ఆర్.సెల్వం, విద్యాశాఖామంత్రి నమశ్శివాయం, పార్లమెంటరీ కార్యదర్శి జాన్‌కుమార్, విద్యాశాఖ డైరెక్టర్ ప్రియదర్శిని పాల్గొన్నారు.


బెస్ట్‌చైల్డ్ అవార్డు గ్రహీతలకు బహుమతులు అందజేస్తున్న సీఎం రంగసామి

వలంటీర్లకు వందనం

సేవకు సలాం

తాళ్లరేవు: ఇతని పేరు కడియాల దుర్గాప్రసాద్. తాళ్లరేవు సత్రంపేటలో వలంటీర్‌గా సేవలందిస్తున్నాడు. కరోనా సమయంలో విధి నిర్వహణలో ప్రాణాలకు తెగించి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సేవలందించాడు. ప్రతినెలా విధిగా ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించడంతో పాటు జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నింటినీ ఇంటివద్దకే అందజేస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు.


నాగబాబుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ దుర్గా ప్రసాద్

మానవత్వం చూపుతున్నాడు



ముఖ్యంగా మా కుమారుడు కొప్పుల నాగబాబు మానసిక దివ్యాంగుడు. తరచూ ఫిట్స్ వస్తుంటాయి. ఈ నేపథ్యంలో అతని ఆరోగ్యం ఎప్పుడు ఎలా ఉంటుందో చెప్పలేం. అటువంటి పరిస్థితుల్లో మా వలంటీర్ దుర్గాప్రసాద్ మాకు కొండంత అండగా ఉండి సేవలందిస్తున్నాడు. వలంటీర్ చూపిస్తున్న మానవత్వం మరువలేను. – కొప్పుల శేషవేణి, మానసిక దివ్యాంగుడి తల్లి

భద్రాచలం బైక్‌పై వెళ్లి పింఛన్ ఇచ్చి


భద్రాచలంలో పింఛన్ అందిస్తున్న వలంటీర్ రమేష్(ఫైల్)

ఉప్పలగుప్తం మండలం నుంచి భద్రాచలం సుమారు 280 కిలోమీటర్లు. అక్కడకు బైక్‌పై వెళ్లి భార్యాభర్తలకు పింఛన్ అందజేసి వలంటీర్ తన ఔన్నత్యాన్ని చాటుకున్నాడు. ఆయన పేరు మాదే రమేష్ ఎస్.కొత్తపల్లి గ్రామంలో వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అదే గ్రామంలో తన క్లస్టర్‌లో ఉన్న గుత్తుల మహాలక్ష్మి వికలాంగుడు. ఆయన భార్య వెంకాయమ్మ వృద్ధురాలు. 2020లో వారిద్దరికీ అనారోగ్యంగా ఉండడంతో వారి కుమార్తె భద్రాచలంలోని తన ఇంటికి తీసుకెళ్లింది. రెండు నెలలపాటు అందుబాటులో లేక పింఛన్ అందలేదు. దీంతో వలంటీర్ రమేష్ భద్రాచలం బైక్ వెళ్లి భార్యకు రూ.2250 చొప్పున మూడు నెలలకు రూ.6750, భర్త మహాలక్ష్మికి వికలాంగ రూ.3,000 అందించి తిరిగొచ్చాడు.

వలంటీర్ రాకపోయుంటే ఫించన్ రద్దయ్యేది



మేమిద్దరం అనారోగ్యంగా ఉండటంతో మా కూతురు తన ఇంటికి తీసుకెళ్లింది. అప్పటికే రెండు నెలలు పింఛన్ తీసుకోలేదు. మూడో నెల తీసుకోకపోయుంటే పింఛన్ రద్దు అయ్యేది. ఆ సమయంలో మా వలంటీర్ రమేష్ మా వద్దకు వచ్చి నాకు మూడు నెలలు, నా భర్తకు ఒక నెల రూ.9,750 అందించాడు. మా వలంటీర్ చేసిన సాయాన్ని మరువలేం.
– గుత్తుల వెంకాయమ్మ, ఎస్.కొత్తపల్లి, ఉప్పలగుప్తం మండలం

విద్యారంగ పునరుజ్జీవానికి కామరాజ్ కృషి

యానాం: దేశంలోనే మొట్టమొదటిగా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడంతో పాటు విద్యారంగ పునరుజ్జీవానికి విశేష కృషి చేసిన దివంగత ముఖ్యమంత్రి పెరుంతలైవార్ కామరాజ్ నాడర్ చిరస్మరణీయులని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. శనివారం కామరాజ్‌నాడర్ జయంతిని పురస్కరించుకుని స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో స్టూడెంట్స్ డే వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, ఆర్ఏఓ మునిస్వామి, ప్రిన్సిపాల్ వరుగు భాస్కరరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ చిత్ర తదితరులు పాల్గొన్నారు. ఇంటర్మీడియట్‌లో రీజియన్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన గిరియాంపేట విద్యార్థులు పాలెపు కనకేశ్వరీ, టి.శ్రీదేవి, టి సింధులతో పాటు 974 మార్కులు సాధించిన కస్తూరిని సత్కరించారు.


గిరియాంపేట విద్యార్థులను సత్కరించిన మల్లాడి

నూతన పార్టీ కార్యాలయం ప్రారంభం

ముమ్మిడివరం: ముమ్మిడివరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయాన్ని శనివారం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ప్రారంభించారు. నియోజకవర్గ స్థాయి అభివృద్ధి కమిటీ సమావేశానికి హాజరైన మంత్రి తొలుత పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరించారు. ఆయన వెంట స్థానిక ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, కలెక్టర్ హిమాన్షు శుక్లా ఉన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు మంత్రి, కలెక్టర్‌లను గజమాలలతో సత్కరించారు.


నియోజకవర్గ పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జోగి రమేష్

